ప్రజాశక్తి
సోమవారం 10 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం

రేపు కేంద్ర బడ్జెట్‌పై సెమినార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రజలకు వరమా? శాపమా? అనే అంశంపై ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, కోశాధికారి పి.సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌లో బి.ఆర్.అంబేద్కర్ యూనివర్శిటీ కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.సంతోష్ రంగనాథ్, సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాసులు ప్రసంగిస్తారని అన్నారు. ఈ సెమినార్‌కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, మహిళలు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పూత దశలో ఉన్న జీడి చెట్టు



పొగ మంచు పగ

- జీడి, మామిడికి మంచు దెబ్బ
- రాలిపోతున్న పూత
- విజృంభిస్తున్న తెగుళ్లు
- ఆందోళనలో రైతులు
- సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కొద్దిరోజులుగా దట్టంగా కురుస్తున్న పొగ మంచుతో జీడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లుతోంది. ప్రస్తుతం చెట్లన్నీ నిండా పూతతో ఉన్నాయి. ఇటువంటి తరుణంలో మంచు విపరీతంగా కురుస్తుండడంతో పూత రాలిపోవడంతో పాటు తెగుళ్లు విజృంభిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లాలో సుమారు 52 వేల ఎకరాల్లో జీడి, మామిడి తోటలు ఉన్నాయి. సాధారణంగా డిసెంబరు మొదటి వారం నుంచే మామిడి, జీడి చెట్లకు పూత వస్తుంటుంది. గతేడాది నవంబరు, డిసెంబరులో వర్షాలు పడడంతో పూత రావడం కొంత ఆలస్యమైంది. జనవరి నుంచి పూత పూయడం ప్రారంభమైంది. ఇప్పటికే తెల్లదోమ ప్రభావంతో ఉద్యానవన పంటలపై నల్లటి పొర ఏర్పడుతుంటే, దానికి తోడుగా పొగమంచు కురుస్తుండడం పూతపై ప్రభావం చూపిస్తోంది. మంచు ప్రభావంతో టి దోమ ఉధృతి పెరుగుతోంది. తోటల్లో కలుపు ఎక్కువగా ఉండడంతో, చాలా ప్రాంతాల్లో ఈ తెగుళ్లు శరవేగంగా వ్యాపిస్తున్నాయి.

ప్రజాశక్తి - కవిటి

ఉత్తర కోస్తా జిల్లాల్లో ఎక్కువగా కనిపించే టి దోమ, ఆకు, పూత గూడుకట్టు పురుగు, పండినల్లి వంటి పురుగులు పంటకు తీవ్రమైన హాని కలిగిస్తాయని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు. ఇటువంటి సమయంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని సూచిస్తున్నారు.

టి దోమ

టి దోమ పిల్ల పురుగులు, తల్లి పురుగులు జీడి, మామిడి చెట్ల లేత కొమ్మలు, పూత రెమ్మలను ఆశించి వాటి రసాన్ని పీల్చేస్తాయి. దీంతో ఎర్రని జిగురు లాంటి బిందువులు పూత రెమ్మలపైన ఏర్పడతాయి. దీనివల్ల పూత, పింది మాడిపోయి రాలిపోయి దిగుబడిలో భారీగా తగ్గుదల ఏర్పడుతుంది.

నివారణ

చిగురు దశలో లీటరు నీటిలో మోనో క్రోటోఫాస్ 1.5 ఎంఎల్ కలుపుకొని పిచికారీ చేయాలి. పూత వచ్చిన తర్వాత మరోసారి చేసుకోవాలి. రెండోసారి పిచికారీ చేసుకునే సమయంలో ల్యామ్డా సైలహాత్రి లీటరు నీటిలో 0.6 ఎంఎల్ కలుపుకోవాలి. లేకుంటే క్లోరిపైరిపాస్ లీటరు నీటిలో 2 ఎంఎల్ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. గింజ ఏర్పడుతున్న దశలో లీటరు నీటిలో ప్రొఫినోపాస్ ఒక ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఆకు, పూత గూడుకట్టు పురుగు

టి దోమతో పాటు ఆకు, పూత గూడుకట్టు పురుగు జీడి, మామిడి పంటలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఈ పురుగు లేత మొక్కలకు ఎక్కువగా హాని కలిగిస్తుంది. ముఖ్యంగా కొత్త చిగురు, పూత దశలో ఈ పురుగు ఎక్కువగా కనిపిస్తోంది. ఇది ఆకుల్ని, పూతను గూడు కట్టుకుంటూ పోతుంది. దాంతో కొమ్మల చివర బూజు ఏర్పడి, పూత బాగా తగ్గిపోతుంది. అంతేకాకుండా ఇది ఎదుగుతున్న గింజలు, పండును గీకి తినడంతో పంట నాణ్యత తగ్గిపోవడమే కాకుండా దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. వీటితో పాటు తామర పురుగుల బెడద కూడా పెరిగే ప్రమాదం ఉంది.

నివారణ

మోనోక్రోటోపాస్ లీటరు నీటిలో 1.6 ఎంఎల్ కలుపుకుని పిచికారీ చేయాలి. లేకుంటే డైమీదియోట్ లీటరు నీటిలో 2 ఎంఎల్ కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.

పండినల్లి పురుగు

పండినల్లి పురుగు కూడా జీడి, మామిడి పంటలను ఆశించే ప్రమాదం ఉంది. పిండినల్లి తల్లి, పిల్ల పురుగులు లేత ఆకుల కాండం, పుష్పాలు, కాయలు నుంచి రసాన్ని పీల్చేస్తాయి. పిండినల్లి ఆశించిన చెట్టు పాలిపోయినట్లు కనిపిస్తుంది. తేనె వంటి జిగురు ద్రవం ఏర్పడి, ఆకులు పువ్వులపైన నల్లని మసిలా ఏర్పడుతుంది.

నివారణ

పిండినల్లి నివారణకు డైఫ్లోర్వస్ లీటరు నీటిలో 2.5 ఎంఎల్ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. లేకుంటే లీటరు నీటిలో ఎసిఫెట్ 1.5 గ్రాములు కలుపుకొని పిచికారీ చేయాలి. ఇవే కాకుండా ఎదుగుతున్న గింజలు రాలిపోవడం, మెత్తబడిపోవడం, నల్లగా మారిపోవడం వంటి లక్షణాలు గమనిస్తే కార్బండిజం లీటరు నీటిలో ఒక గ్రాము కలుపుకుని పిచికారీ చేసుకోవాలి. వీటితో పాటు పూత రాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే మల్టీ కె, 191919 లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా జీడి, మామిడి పంటలను కాపాడుకోవచ్చు. ముఖ్యం గా టి దోమ, పిండినల్లి, ఆకు పూత గూడుకట్టు పురుగులు జీడి, మామిడి పంటలకు భారీ నష్టం కలిగిస్తాయి. వీటి నివారణకు ఉద్యానవన శాఖ అధికారులు సూచించిన మందులు పిచికారీ చేయడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చు.

రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యానశాఖ అధికారి మాధవీలత

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

కళలను భావితరాలకు అందించాలి

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఆమదాలవలస

కళలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. పట్టణంలోని పాలపోలమ్మ తల్లి గుడి ఆవరణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు శ్రీకాకుళం జిల్లా అని అన్నారు. ఆమదాలవలసలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలకు లభిస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందం కలుగుతోందన్నారు. ఇటువంటి కార్యక్రమం నాటక రంగానికి జీవం పోసినట్లు ఉందని రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని విద్యాసాగర్, పేడాడ ప్రతాప్ కుమార్‌తో పాటు సంఘ ప్రతినిధులను అభినందించారు. ఆమదాలవలసలో ఆడిటోరియం నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కళలను ప్రోత్సహించడమంటే సంప్రదాయాలను పరిరక్షించుకోవడమేనన్నారు. ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తుందంటే మన కళలు, సంప్రదాయలే కారణమన్నారు. వచ్చే రెండేళ్లలో పట్టణంలో రూ.రెండు కోట్లతో కళా ప్రాంగణం నిర్మించి కళాకారులకు అంకితమిస్తానని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, నూకరాజు, బంకుపల్లి శ్రీరామచంద్రమూర్తి, మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ తదితరులను రంగస్థలం కళాకారుల సంఘ ప్రతినిధులు సత్కరించారు.

దాతల సాయం కోసం ఎదురుచూపులు

(6లో)

మరిన్ని వార్తల కోసం
www.prajasakti.com
epaper.prajasakti.com

విఒఎల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వెలుగు విఒఎల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికను నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షులుగా అల్లు మహాలక్ష్మి, అధ్యక్షులుగా వి.ధనలక్ష్మి, ప్రధాన కారదర్శిగా గొండు అసిరినాయుడు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దండుపాటి జోగారావు, సంయుక్త కార్యదర్శిగా నౌపడ రాజేశ్వరి, కోశాధికారిగా బిశెట్టి హేమలతతో పాటు మరో 30 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ వెలుగు విఒఎలు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తలుగా ఉన్నారని తెలిపారు. విఒఎలతో పలురకాల పనులు చేయించుకుంటున్న ప్రభుత్వం, వారిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే విఒఎల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని, రాజకీయ వేధింపులు ఉండబోవని హామీనిచ్చిన కూటమి ప్రభుత్వం, తక్షణమే హామీని నెరవేర్చాలన్నారు. ఆన్‌లైన్ సైట్‌లో మార్పులు చేసి కొత్త సిమ్‌కార్డులు, రీఛార్జి మొత్తాలను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. యాప్‌లతో పాటు పని భారం తగ్గించాలని కోరారు.

మాట్లాడుతున్న అసిరినాయుడు

నేడు డీవార్మింగ్ డే

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డీవార్మింగ్ డేను పురస్కరించుకుని ఈనెల పదో తేదీన నులిపురుగులను నివారించేందుకు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలమురళీకృష్ణ తెలిపారు. పదో తేదీన మాత్రలు వేసుకోని వారికి 17వ తేదీన వేయనున్నామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్ - 400 మి.గ్రా) నమిలి తినిపించనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి రెండేళ్ల వరకు అర మాత్ర, 2 నుండి 19రేళ్ల వరకు ఒక మాత్ర చొప్పున ఇవ్వనున్నా మని చెప్పారు. పాఠశాలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ఈ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించన ున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భోజనం తర్వాత ప్రతి విద్యార్థికి మొతాదు ప్రకారం నమిలి మింగిస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం 4,46,992 మందికి

పిల్లలు, విద్యార్థులకు అందజేయడానికి మాత్రలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో అన్ని పాఠశాలలకు మాత్రలు పంపిణీకి సిద్ధం చేశామని చెప్పారు. వైద్య సిబ్బందితో పాటు అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాల సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మండల పరిధిలోని పిహెచ్‌సి వైద్యాధికారులు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, సిడిపిఒలు, సిఆర్‌పిల ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు ఉండవని స్పష్టం చేశారు. ఒకవేళ అలా కనిపిస్తే సమీపంలోని ఆశా కార్యకర్త, ఎఎన్ఎం ద్వారా పిహెచ్‌సి వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం జిల్లాస్థాయిలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా విద్యాశాఖాధికారి, ప్రాజెక్ట్ అధికారి (సమగ్ర శిక్ష), ఐసిడిఎస్ పీడీ సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న శైలేష్‌కుమార్

వెట్టి చాకిరీ రహిత జిల్లాకు కృషి

కార్మికశాఖ సహాయ అధికారి వై.శైలేష్ కుమార్

శ్రీకాకుళం అర్బన్: జిల్లాను వెట్టి చాకిరీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా కార్మిక శాఖ సహాయ అధికారి వై.శైలేష్ కుమార్ అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోం వద్ద కార్మిక చట్టాలపై కార్మికులకు అవగాహనా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అంతకుముందు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను నిర్బంధించి పనిచేయించడం చట్టరీత్యా నేరమన్నారు. పని ప్రదేశాల్లో కార్మికులపై నిర్బంధ విధానాలను అమలు చేస్తే, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నిర్ణీత పని గంటల తర్వాత కార్మికులు స్వేచ్ఛగా తమకు నచ్చిన చోట జీవించే హక్కు ఉందన్నారు. యజమాన్యానికి డబ్బులు బకాయిలు ఉన్నాయన్న కారణంతో నిర్బంధించి పని చేయించడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎఎల్ఒ-2 ఆర్.వి శ్రీనివాసరావు, లైన్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు, ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు చిక్కాల గోవిందరావు, నేచర్ ఎన్‌జిఒ ప్రతినిధులు శేఖర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు క్లస్టర్ల విభజన

- పరిసరాల పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం
- రోడ్లపై పశువులు సంచరిస్తే చర్యలు
- ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని విడనాడాలి
- శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ సుధీర్ కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగర ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరని, దీనికి కోసం ప్రజల్లో అవగహన కల్పించి మెరుగైన పరిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పి.సుధీర్ కుమార్ అన్నారు. పారిశుధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ సత్ఫలితాలు రాబట్టేందుకు నిరంతరాయంగా కృషి చేస్తున్నామన్నారు. రోగ కారకాలైన ప్లాస్టిక్ వాడకంపై నిషేధం అమలు చేస్తున్నామని అన్నారు. అయితే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్లాస్టిక్ వాడకాన్ని వదులుకుంటే తప్ప శతశాతం అరికట్టడం సాధ్యం కాదన్నారు. అయినా నిబంధనలకు లోబడి వ్యాపారులపై తరచూ దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. నగరంలో పారిశుధ్య పరిస్థితులు, సిబ్బంది కొరత, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధం, రోడ్లపై పశువుల సంచారం, దోమ నివారణకు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తడి, పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలిస్తున్నామన్నారు. నిరంతరాయంగా సాగుతున్న పారిశుధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. నగర పరిధిలోని 50 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై తీసుకుంటున్న చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో పలు వివరాలు వెల్లడించారు.

? సుందర నగరానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ప్రధానంగా శ్రీకాకుళం నగరంలో పశువుల పెంపకందారులు తమ అవసరాలు తీర్చుకుని రోడ్లపైకి పశువులను విడిచిపెడుతున్నారు. దీంతో రేయింబవళ్లు పశువుల సంచారం రోడ్లపైనే ఉంటున్నాయి. వాటితో వ్యర్థాలు వల్ల రోడ్లు శుభ్రం చేయడం కష్టమవుతోంది. అందువల్ల ఇప్పటికే యజమానులకు పలుమార్లు చెప్పాం. అయినా మార్పు కనిపించకపోవడంతో పశువులను వాహనాల్లోకి ఎక్కించి దూరప్రాంతాలకు తరలించాం. మరోవైపు యజమానులను గుర్తించి వారిపైనా చర్యలు తీసుకుంటున్నాం.

? పారిశుధ్య మెరుగుకు చర్యలు ఏమిటి?

నగరపాలక సంస్థ పరిధి విస్తరించిన తర్వాత మరింత బాధ్యత పెరిగింది. విలీన పంచాయతీలను కలుపుకుని నగరపాలక సంస్థ పరిధిలో 50 వార్డులున్నాయి. వాటి పరిధిలో 70 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 317 మంది కాంట్రాక్టు కార్మికులు సేవలందిస్తున్నారు. వీరితో పాటు విలీన పంచాయతీల్లో మరో 109 మంది కార్మికులు నియమించి పారిశుధ్య పనులు చేపడుతున్నాం. కార్మికులపై పర్యవేక్షించేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ గతంలో ఉండేవారు. కార్పొరేషన్ పరిధిలో మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వార్డు సచివాలయాల్లో శానిటరీ సెక్రటరీలు పర్యవేక్షణ కాలువల్లో పూడికతీత, చెత్త తొలగింపు, ఇంటింటికీ చెత్త సేకరణ సజావుగా నిర్వహించడంతో పారిశుధ్యం మెరుగుపడుతోంది. ఎక్కడైనా నిర్లక్ష్యంగా సిబ్బంది ఉంటే స్థానికుల నుంచి ఫిర్యాదులు వెంటనే చర్యలు తీసుకుంటున్నాం.

? సీజనల్ వ్యాధుల నివారణపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

దోమల నివారణలో భాగంగా ముందు లార్వా ఉత్పత్తి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలను వేయడం, మరోవైపు మురుగుదొడ్ల గొట్టాలకు మెస్‌లు అమర్చడం వంటి చర్యలు చేపట్టాం. ఈ ఏడాది వర్షాకాలంలో ఆరంభం నుంచి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవతో ప్రభుత్వం కాలువల్లో పెద్దఎత్తున పూడికతీత పనులు చేపట్టాం. దీనివల్ల మురుగునీరు నిల్వలు కొంతమేరకు తగ్గాయి. ఇప్పుడు వేసవి సీజన్ మొదలు కావడంతో దోమలు వృద్ధి కొంత తగ్గుముఖం పడుతుంది. అయితే ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు, పొదలు పెరగడం వల్ల విలీన పంచాయతీల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఈ మొక్కలపై పలుమార్లు మలాథిన్ స్ప్రే చేయించాం.



? పాలిథిన్ కవర్ల వాడకం నిషేధం అమలు ఎలా ఉంది?

ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నగరంలో నిషేధించాం. అందులో భాగంగా తరచూ దుకాణదారులపై తనిఖీలు చేపడుతున్నాం. పాలిథిన్ కవర్లు దొరికితే ఆ వ్యాపారులపై అపరాధ రుసుం విధిస్తున్నాం. గడచిన రెండు నెలల వ్యవధిలో 120 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసి వారి నుంచి అపరాధ రుసుం విధించాం. అయితే పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలంటే ప్రజలు సహకరించాలి. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా తనతో పాటు గుడ్డ సంచిని తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి. చేపలు, మాంసం వంటి వస్తువుల కోసం వెళ్లేటప్పుడు క్యారియరు తీసుకెళ్లాలి. లేకుంటే మార్కెట్‌కు వెళ్లి సరకులు కొన్న తర్వాత వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి కవర్లు తీసుకుంటున్నారు. వారి వ్యాపార లాభాపేక్ష వల్ల కవర్లు దాచి పెట్టి ఇస్తున్నారు. ప్రజలు సహకరిస్తే తప్ప శతశాతం కవర్లు వాడకాన్ని అడ్డుకట్ట వేయడం కష్టసాధ్యం. అయినా పెద్దఎత్తున తనిఖీలు చేపడుతున్నాం.

? పారిశుధ్య కార్మికులపై పనిభారాన్ని ఎలా తగ్గించగలుగుతున్నారు?

పారిశుధ్య నిర్వహణకు 50 డివిజన్ల పరిధిలో సరిపడినంత సిబ్బంది లేకపోవడం ఇబ్బందికరం. ఒక్కో డివిజన్‌లో ఎక్కువ మంది సిబ్బంది పని చేస్తున్నారు. అక్కడ పని తక్కువగా ఉంటోంది. పని ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో సిబ్బంది సరిపోవడం లేదు. దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాటిని అధిగమించడానికి క్లస్టర్లు విభజించి పనులు కేటాయిస్తున్నాం. నగరంలో సిబ్బంది కొరత సరిచేయడానికి వీలుంది. కానీ, విలీన పంచాయతీల్లో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. విశాలమైన ప్రాంతాల ఉండి అక్కడ ఇద్దరు ముగ్గురు పనిచేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి వస్తోంది. ఈ సమస్యపై కమిషనర్‌తో చర్చించాం. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు ఆలోచిస్తున్నాం.

? రోడ్లపై పశువుల సంచారాన్ని ఎలా అడ్డుకుంటున్నారు?

నగరంలో కొన్ని ప్రాంతాల్లో గేదెల పెంపకందారులు నివాస ముంటున్నారు. ఆవు జాతి సంతతిని కూడా వారే పెంచుతున్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా ఉండి వాటిని రోడ్లపై విడిచి పెడితే వాటిని నగరపాలక సంస్థ సిబ్బంది పట్టుకుంటారు. ఒకసారి పట్టుబడితే వాటిని పశుసంరక్షణ కేంద్రాలకు పంపిస్తున్నాం. రూ.వేలాది ఖర్చుతో వాటిని కొనుగోలు చేసిన పెంపకదారులు తీవ్రంగా నష్టపోతారు. అందువల్ల వారికి పలుమార్లు హెచ్చరించాం. వారిలో మార్పు రాకపోతే చర్యలు మొదలు పెడతాం. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వాటిని సీజ్ చేస్తాం.

కుంభమేళా స్పెషల్ బస్సులకు స్పందన

- 16న అదనంగా మరో బస్సు
- జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నుంచి ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాకు వెళ్లే వారి కోసం ఈనెల 8వ తేదీన ఆర్‌టిసి ఏర్పాటు చేసిన స్పెషల్ సూపర్ లగ్జరీ బస్సుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. దీంతో ఈనెల 12వ తేదీన మరో స్పెషల్ బస్సును ఏర్పాటు చేయగా, ఆ బస్సు టిక్కెట్ బుకింగ్స్ పూర్తయ్యాయన్నారు. ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనకు అనుగుణంగా ఈనెల 16న మరో ప్రత్యేక సర్వీసును మహా కుంభమేళాకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 16న శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి రాత్రి ఎనిమిది గంటలకు ఈ బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 7 రోజుల్లో రెండో రోజు ఉదయానికి పూరి చేరుకుంటుందని చెప్పారు. పూరీలో జగన్నాథ స్వామి వారి దర్శనం, కోణార్క్, సాయంత్రం భువనేశ్వర్‌లోని లింగరాజ్ ఆలయం దర్శించుకున్న తర్వాత మూడో రోజు సాయంత్రానికి ప్రయాగ్‌రాజ్ చేరుకుంటుందన్నారు. నాలుగో రోజు త్రివేణి సంగమంలో స్నానాల తర్వాత రాత్రి బయలుదేరి ఐదో రోజు ఉదయానికి వారణాశి చేరుకుంటుందని తెలిపారు. కాశీ విశ్వేశ్వరుని దర్శన అనంతరం ఆరో రోజు ఉదయం వారణాశి నుంచి బయలుదేరి గయ, బుద్ధగయ క్షేత్రాల దర్శనానంతరం ఏడో రోజు రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటుందని వివరించారు. ఈ సర్వీస్‌కు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పది కిలోమీటర్ల లోపు 35 మంది ప్రయాణికులు ఒకేచోటు నుంచి బయల్దేరితే బస్సు వారు కోరిన ప్రదేశానికి పంపుతామన్నారు. టిక్కెట్ ఒకరికి రూ.9,500 అని, యాత్ర సమయంలో యాత్రికులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర, వసతి ఖర్చులు యాత్రికులు భరించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959235609, 9959225610, 9959225611, 7382917289, 7382921647, 7382923311, 7382924758 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న విజయ్ కుమార్

శ్రేయమిశ్రాకు నంది అవార్డు

పాతపట్నం: పాతపట్నం జర్నలిస్టు కాలనీకి చెందిన శ్రేయమిశ్రా జాతీయ స్థాయి నంది అవార్డును అందుకున్నారు. విశాఖపట్నం ఆంధ్రా విశ్వవిద్యాలయం నార్త్ క్యాంపస్ గౌతమ బుద్ధ అంబేద్కర్ ఆడిటోరియంలో ఆదివారం శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ జాతీయ స్థాయి సంగీత నృత్య ఉత్సవాలు- 69 నిర్వహించారు. అందులో శ్రేయమిశ్రా ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి నంది అవార్డు దక్కింది. ఈ మేరకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీ నటులు సుమన్ చేతులు మీదుగా శ్రేయ జాతీయ స్థాయి గోల్డెన్ నంది అవార్డును అందుకున్నారు.

నంది అవార్డుతో శ్రేయమిశ్రా

తిలక్‌తో వైసిపి మండల నాయకులు

వైసిపి బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వైసిపి బలోపేతానికి కృషి చేస్తామని మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజు అన్నారు. వైసిపి నాయకులతో నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌ను ఆదివారం కలిసి పార్టీ పరిస్థితిని వివరించారు. అన్ని తరగతుల వారిని కలుపుకుని సమన్వయంతో పనిచేసి మళ్లీ జగన్‌ను సిఎం చేసేందుకు అలుపెరగని పోరాటం చేస్తామని అన్నారు. సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని త్వరలోనే ప్రజలు నిలదీస్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అన్నెపు రామారావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఎంపిపి ఉమా మల్లయ్య, బిసి సెల్ అధ్యక్షులు వెంకటరావు, టెక్కలి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గొండు చాందిని మురళి పాల్గొన్నారు.

నాటుసారా అక్రమ రవాణాపై నిఘా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

దుర్గాప్రసాద్, ఎక్సైజ్ సిఐ

నాటుసారా, అక్రమ మద్యం అమ్మకాలు, రవాణాపై గట్టి నిఘా పెట్టామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. వీటిపై ఎవరికైనా సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబరు 14405కి సమాచారం అందజేయాలని కోరారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం వరకు ఐదు కేసులు నమోదు చేశామన్నారు. ఇందులో ఒడిశా మద్యం కేసులు మూడు, ఆంధ్రాలో రెండు కేసులు నమోదయ్యాయని అన్నారు. సమాచారం అందించిన వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

గతమెంతో వైభవం.. నేడు పెనుభారం

- పెరిగిన టిటిడి కళ్యాణ మండపం ఛార్జీలు
- ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి- బూర్జ

ఒకప్పుడు టిటిడి కళ్యాణ మండపంలో వివాహం అత్యంత ఘనంగా జరిగేది. ముఖ్యంగా టిటిడి కళ్యాణ మండపంలో నామమాత్రపు చార్జీలు వసూలు చేయడం, తక్కువ ఖర్చుతో వివాహం జరగడంతో ఎంతో ఆనందంగా వివాహం జరిపేవారు ఇది గతం. నేడు ఇదే టిటిడి కళ్యాణ మండపంలో వివాహం జరపాలంటే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 35 ఏళ్ల క్రితం బూర్జ మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు వివాహం జరపాలంటే సరైన వసతి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. అయితే పలు విజ్ఞప్తుల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఇక్కడ కళ్యాణ మండపం కట్టేందుకు నిర్ణయించుకుంది. స్థానికులు స్థలంతో పాటు డొనేషన్లు కూడా ఇస్తే కళ్యాణ మండపం కట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ఇందుకు స్థానిక నారంశెట్టి అప్పల నరసింహులు స్పందించి గ్రామంలో కళ్యాణ మండపం ఉంటే ప్రజలకు ఆసరాగా ఉంటుందనే ఉద్దేశ్యంతో కళ్యాణ మండపం నిర్మాణానికి ఉచితంగా స్థలం ఇవ్వడంతో పాటు కొంత విరాళం కూడా అందజేశారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టింది.

నామమాత్రపు చార్జీలు

టిటిడి కళ్యాణ మండపం ప్రారంభమైన తర్వాత దేవస్థానం వారు నిర్ణయించిన చార్జీలు వసూలు చేసేవారు. వివాహం జరపాలంటే కేవలం రూ.1016 మాత్రమే కట్టాల్సి ఉండేది. అలాగే వాడిన విద్యుత్‌కు బిల్లులు చెల్లించే వాళ్లమని, అలాగే బయట నుంచి సన్నాయిమేళం, విద్యుత్ దీపాల అలంకరణ, వంటివి బయట నుంచి పెట్టుకునే వాళ్లమని, ఇందుకుగాను టిటిడి కళ్యాణ మండపానికి ఒక్కరూపాయి కూడా చెల్లించే వారు కాదని స్థానికులు తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తులకు

నిరుపేద నుంచి ధనికుల వరకు టిటిడి కళ్యాణ మండపంలో అతితక్కువ ఖర్చుతో వివాహం జరుపుకునేవారు. అయితే గత వైసిపి ప్రభుత్వంలో టిటిడి కళ్యాణ మండపాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు.

పెరిగిన ఛార్జీలు

ప్రస్తుతం టిటిడి కళ్యాణ మండపంలో వివాహం జరపాలంటే రూ.5,900 డిడి తీయాల్సి ఉంది. అంతేకాకుండా సన్నాయి మేళం, విద్యుత్ దీపాల అలంకరణ, సప్లయర్స్ వంటివి బయట నుంచి తీసుకు వస్తే అందుకుగాను 30శాతం చార్జీలు చెల్లించాలని నిర్వాహకులు తెలుపుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

వివాహం భారమే..

టిటిడి కళ్యాణ మండపంలో వివాహం చేయాలంటే తలకుమించిన భారమవుతుందని స్థానికులు వాపోతున్నారు. ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టిటిడి కళ్యాణ మండపాన్ని దేవస్థానం వారే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

టిటిడి కళ్యాణ మండపం

అధిక వ్యయం తప్పడం లేదు

టిటిడి కళ్యాణ మండపంలో వివాహం జరపాలంటే అధికంగా వ్యయం అవుతుంది. గతంలో రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు డిడి చెల్లించే వాళ్ళం. ఇప్పుడు రూ.6 వేలు వరకు డిడిలు చెల్లించమంటున్నారు. పేదవాళ్లకు వివాహం పెను భారంగా మారింది.

- నాయకమ్మ, బూర్జ

టిటిడి నిర్వహణ చేపట్టాలి

కళ్యాణ మండపం టిటిడి అధికారులే నిర్వహణ చేపట్టాలి. ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం కారణంగా వివాహం చేయాలంటే అధిక ఖర్చులు తప్పడం లేదు. పేదవారు వివాహాలు జరిపించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు శ్రద్ధ చూపి చర్యలు చేపట్టాలి.

- కిశోర్, బూర్జ

బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

గణితంతో మేధస్సుకు పదును

ప్రజాశక్తి- పొందూరు

గణితం విద్యార్థుల మేదస్సుకు పదును పెడుతుందని ఎంఇఒ-2 పట్నాన రాజారావు అన్నారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వావిలపల్లి పేట వద్ద మోడల్‌స్కూల్‌లో మండలంలోని 6, 7 తరగతుల విద్యార్థులకు గణితంలో క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమస్థానం పొందూరు మోడల్‌స్కూల్, రెండోస్థానం తాడివలస జెడ్‌పిహెచ్‌ఎస్, మూడో స్థానం పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుల వేదిక సభ్యులు పి.హరిప్రసన్న, జి.వేణుగోపాలరావు, ఎస్.సత్తిరాజు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న క్లబ్ సభ్యులు

మొక్కలు నాటాలి

ఇచ్ఛాపురం : ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని లయన్స్‌క్లబ్ అధ్యఓఉలు లోపింట నరసింహమూర్తి అన్నారు. స్థానిక రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో 20 రకాల మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాత్రికులకు ఉపయోగకరంగా ఉండడానికి, సేదదీరడానికి ఈ మొక్కలను నాటామన్నారు. కార్యక్రమంలో బత్తుల వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ తెలుకల రామారావు, పాకదాసు పాల్గొన్నారు.

పురందేశ్వరిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఆలయకమిటీ సభ్యులు

మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న పురందేశ్వరి

ప్రజాశక్తి- లావేరు / రణస్థలం రూరల్

మండలం కమ్మ సిగడాం శ్రీ మహాలక్ష్మి అమ్మవారి మూడురోజుల జాతర సందర్భంగా ఆఖరిరోజు ఆదివారం అమ్మవారిని రాజమండ్రి ఎంపీ, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలయకమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు వి.వి.ఎస్.ఇ ప్రసాద్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బంటుపల్లి సర్పంచ్ నడుకుదిటి రజిని, ఆలయకమిటీ సభ్యులు వేలిచేటి రాజశేఖర్, సురేష్, రణస్థలం టిడిపి అధ్యక్షుడు లంక శ్యామలరావు, ఎన్.తేజబాబు, వెలిచేటి చిన్నమౌళి, లావేరు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, టిడిపి నాయకులు పిసిని జగన్నాథం, రణస్థలం సర్పంచ్ పిన్నింటి బానోజీరావు, అలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

నందిగాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-92 మధ్య పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తమ చదువుకున్న పాఠశాల వద్దకు ఉదయం 9 గంటలకు చేరుకుని ఆటాపాటలతో అలనాటి స్నేహితులు నెమరు వేసు కుంటూ రోజంతా సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఆనాటి ఉపాధ్యాయులు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఆది నారాయణ, తాతయ్య, సద్గుణమూర్తు, ప్రస్తుత హెచ్‌ఎం హరిబాబులను సన్మానించారు.పూర్వ విద్యార్థులు శాంతికుమార్, జె.జయరామ్, లక్ష్మీ నారాయణ, ప్రగడ రవిబాబు, వెంకటరమణ, దేవరాజు, జె.నీరజ, ఉషారాణి, వనజాక్షి, లలిత, అనంత పాల్గొన్నారు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రశాంతంగా గణిత క్విజ్ పోటీలు

టెక్కలి : మెమోంటోలతో విద్యార్థులు

టెక్కలి: సిక్కోలు గణిత ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యాన 6,7 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలో మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలలో రెండు ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 8 జట్లు పాల్గొన్నాయి. ఆరు రౌండ్ల పాటు నిర్వహించిన క్విజ్ పోటీల్లో తలగాం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. బోరిగిపేట ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ, సీతాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలోనూ నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయ సంఘం నిర్వాహకులు నరేష్, పాపారావు, మురళి, శ్రీనివాసరావు, స్వర్ణలత, జ్యోతి, క్రాంతి, జయకుమార్, కృష్ణ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యాన విద్యార్థులకు గణితంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల స్థాయిలో 8 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ద్వితీ, కడుం ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ, పొన్నుటూరు పాఠశాల విద్యార్థులు కన్సోలేషన్ బహుమతులు గెలుపొందారు. విజేతలకు గణిత ఉపాధ్యాయులు సంఘం మండల కన్వీనర్ దండు ప్రకాశరావు, గణిత ఉపాధ్యాయులు ఎల్.గోవర్ధనరావు, జి.భాస్కరరావు, మీనాకుమారి, బి.గణేష్, జి.కృష్ణ, రామచంద్రరావులు బహుమతులను అందజేశారు.

విద్యార్థులకు పోటీతత్వం అవసరం

విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థి చదువుకునే ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతో పాటు పట్టుదల, కృషి, పోటీతత్వం అలవర్చుకోవాలని పలువురు వక్తలు సూచించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆంధ్రప్రదేశ్ బయాలజీ టీచర్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యాన జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. గత నెల నాలుగో తేదీన నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన గ్రూప్ విద్యార్థులకు జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. 27 మండలాల నుంచి 27 బృందాలు పాల్గొన్నాయి. ఒడియా పాఠశాలల నుంచి ఆరు బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో తామాడ మోడల్ స్కూల్, విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రొంపివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, పెద్దపద్మాపురం హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం దక్కించుకున్నారు. ఒడియా విభాగంలో టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, ఈదుపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాలను దక్కించుకున్నారు. పరీక్షల అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో టెక్కలి డిప్యూటీ డిఇఒ విలియమ్స్, పరీక్షల కమిషనర్ అలియత్ ఖాన్ పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడానికి, పోటీతత్వాన్ని పెంపొందించడానికి టాలెంట్ టెస్టు దోహదపడుతుందన్నారు. సైన్స్ దృక్పథాన్ని ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలన్నారు. బయాలజీ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, జిల్లా సైన్స్ అధికారి నల్లా కుమారస్వామి, సైన్స్ ఉపాధ్యాయులు ప్రమోద్ కుమార్ పాడి, మురళీ దొళై, గొంటి గిరిధర్, మంచు కవిత, కె.గగన కుమారి, జి.మోషే, సోషల్ సైన్స్ ఫోరం జిల్లా కార్యదర్శి బాడాన రాజు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల జెఎసి ఏర్పాటు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విజయవాడలో ఆదివారం జరిగిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల సమావేశంలో 26 గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలు పాల్గొని సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి ఐక్య కార్యాచరణ సమితిని ఏర్పాటు చేసినట్లు సచివాలయ గ్రామ వార్డు రాష్ట్ర సెక్రటరీ జనరల్ కూన వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్‌గా డాక్టర్ భీమిరెడ్డి అంజనరెడ్డి, సెక్రటరీ జనరల్‌గా కూన వెంకట సత్యనారాయణ, ట్రెజరర్‌గా మురళి బాబు, వైస్ చైర్మన్‌గా మహాలక్ష్మి, మధులత, అరుణకుమారి ఆర్గనైజింగ్ సెక్రటరీగా గుడి నాగరాజు, కిషోర్, మోపూరి శ్రీనివాసులు, పబ్లిసిటీ సెక్రటరీగా అశ్వర్థ, మరియ దాసు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ జనరల్ మాట్లాడుతూ రేషనలైజేషన్ ప్రక్రియ జరిపే ముందు గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాలతో చర్చించి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని తరువాతే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రతి జిల్లా మండలం, గ్రామస్థాయి వరకు ఐక్య కార్యాచరణ సమితి కమిటీలను నియమించి జెఎసి బలోపేతానికి, ఉద్యోగుల అభ్యున్నతికి అందరు ఉద్యోగుల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు.

దాతల సాయం కోసం ఎదురుచూపులు

బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న తేజస్విని

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండలంలోని పైడిభీమవరానికి చెందిన గేదెల తేజస్విని పైడిభీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. ఆర్థిక స్థోమత లేక చదువు మధ్యలోనే ఆపేసి ఇంటిలోనే ఉంటుంది. అరు నెలలు క్రితం కళ్లు మసకగా కనిపిస్తున్నాయని చెప్పడంతో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రికి తీసుకెళ్లి చూపించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే విశాఖపట్నం మహాత్మ గాంధీ ఆస్పత్రికి, కెజిహెచ్‌కి, తిరుపతి పద్మావతి ఆస్పత్రి, అగనంపూడి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అప్పులు చేసి సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చులు పెట్టారు. కానీ ఫలితం లేకుండా పోయింది. పూర్తిగా నయం కావాలంటే చైన్నై ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్‌కు రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఏమి చేయలేక తేజస్విని ఇంటికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఇంటి వద్ద తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతుంది. తండ్రి గేదుల సింహాద్రి 2019లో అనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి కోటలక్ష్మి ఎపిటోరియా (అరబిందో) పరిశ్రమలో రోజు కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని సాగుతోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తేజస్విని దాతలు ఎవరైనా ముందుకొచ్చి తమకు తోచిన సహాయం చేసి నిండు ప్రాణాన్ని బతికించాలని తల్లి కోరుతుంది. సర్పంచ్ ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా... సహాయం చేసే చేతులు మిన్న... ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని యువతకు పిలుపునిచ్చారు. ఒక నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారికి మనమందరం అండగా ఉండాలని, ఎవరికి తోచిన సహాయం వారు చేయాలని కోరారు. తల్లి మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందించి ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మందులు కొనుగోలు కూడా డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కన్నీటిపర్యంతమయ్యారు. ఎవరైనా సహాయం చేయదలచుకున్న వారు ఫోన్‌పే నంబరు 9951509027 చేయాలని విజ్ఞప్తి చేశారు.

తల్లి లక్ష్మితో తేజస్విని (ఇన్‌సెట్‌లో తేజస్విని)

రసవత్తరంగా నాటిక పోటీలు

పక్కింటి మొగుడు నాటికలో ఒక సన్నివేశం

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని బొరివంకలో నిర్వహిస్తున్న బల్లెడ అనసూయమ్మ స్మారక ఆహ్వానిత ఉభయ తెలుగు రాష్ట్రాల పరిషత్ నాటిక పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన పక్కింటి మొగుడు, చిగురుమేఘం నాటికలు ఆహూతులను అలరించాయి. అవసరాన్ని అవకాశంగా తీసుకుని ఓ లాయర్ ఆస్తిని కాజేసేందుకు ప్రయత్నిస్తే, ఆస్తిని కాపాడుకునేందుకు ఓ మధ్య తరగతి వివాహిత చేసిన ప్రయత్నం ఏవిధంగా సఫలమైందన్న సారాంశంతో ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక ప్రేక్షకులను అలరించింది. గోవిందరాజులు నాగేశ్వరరావు రచించిన ఈ నాటికకు బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించారు. రెండో నాటికలో మానవత్వంతో సామాన్యులకు వైద్యం అందిస్తానని చెప్పి వైద్య వృత్తిలోకి వచ్చిన ఓ సామాన్య రైతుబిడ్డ కార్పొరేట్ కబంధ హస్తాల్లో ఎలా చిక్కుకున్నాడు, గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలు, సరైన వైద్య సదుపాయాలు లేక మరణిస్తున్న సామాన్యుల వ్యథలను కళ్ళకు కట్టినట్టు చూపించిన చిగురుమేఘం కళాభిమానులను కట్టిపడేసింది. కావూరి సత్యనారాయణ రచించిన ఈ నాటికకు వై.హరిబాబు దర్శకత్వం వహిస్తున్నారు వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మనాపురం సత్యన్నారాయణ, కోరుకొండ బ్రహ్మానందం, కెవి మంగరావు వ్యవహరించారు.

చిగురు మేఘంలో ఒక సన్నివేశం

యాత్రికులను ఆకట్టుకుంటున్న గూడు ట్రాక్టర్లు

గూడు బళ్లు కాదు... గూడు ట్రాక్టర్లు

ప్రజాశక్తి - లావేరు / రణస్థలం రూరల్

మండలం కమ్మ సిగడాం శ్రీ మహాలక్ష్మి యాత్రలో గూడు ట్రాక్టర్లు యాత్రికులను ఆకట్టుకున్నాయి. పూర్వం నాటుబళ్లుకి గూడు ఏర్పాటు చేసి ఎద్దులతో కూడి గూడుబళ్లుపై కుటుంబ సమేతంగా దూర ప్రాంతాలకు యాత్రలకు వెళ్లేవారు. ప్రస్తుతం ఆ రోజులు అంతరించిపోవటంతో వినూత్నంగా ట్రాక్టర్ తొట్టెకు కర్రలతో గూడుకట్టి ఆపై మంచు, ఎండ, వర్షం పడకుండా టార్పాలిన్లు, గొనె సంచులు కట్టి గూడు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి యాత్రలో ఇంటిల్లిపాది అందులో కూర్చొని డ్రామాలు, పౌరాణిక నాటకాలను తిలకిస్తున్నారు. యాత్రలో ఇటువంటివి 50పైగా ఉన్నాయి. యాత్రకు వచ్చిన యాత్రికులంతా విటినే తిలకిస్తున్నారు.

విద్యార్థులకు యోగా క్లాసులు

ప్రజాశక్తి- లావేరు

పరీక్ష లైనంత వరకు ప్రతి విద్యార్థి యోగా చేయాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వలన మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉంటారని, పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా పద్మాసనం, తాడాసనం, హాలాసనంతో పాటు సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంఘ ఎన్నికల నోటిఫికేషన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సేవా సంఘం ఎన్నికల ప్రకటనను సైనికుల సంఘం ఫౌండర్ సూర అవతారం ఒక ప్రకటనలో జారీ చేశారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా ముగ్గురు మాజీ సైనికులు లెఫ్టినెంట్ కల్నల్ పి.ఎస్.రావు, సుబేదార్ జి.సత్యనారాయణ, సుబేదార్ మేజర్ బి.సంజీవరావులను నియమించడం జరిగిందని తెలిపారు. మాజీ సైనిక సంఘం అధ్యక్ష పదవి ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయడానికి దరఖాస్తు సమర్పించడానికి ఈ నెల 12న సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 15న సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉందన్నారు. ఎన్నికలను ఈనెల 25న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడునని తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత అదే రోజు లెక్కింపు జరిపి ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. ఎన్నికలను మెహర్‌బాబా హాలులో నిర్వహించబడునని తెలిపారు. ఈ ఎన్నికల్లో సభ్యత్వం తీసుకున్న ఓటర్లు మాత్రమే ఓటు వేయడానికి అర్హులని ఓటు వేసేటపుడు మాజీ సైనికుడి గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు.


సీతంవలస సమీపంలో బిగించని క్రాస్ బేరియర్స్

క్రాస్ బేరియర్స్ బిగించరూ..

ప్రజాశక్తి- లావేరు

రణస్థలం నుంచి విజయనగరం జిల్లా రాజాం వెళ్లే రహదారి రణస్థలం మండలం సీతంవలస గ్రామం సమీపంలోని పచ్చులమ్మ చెరువు వద్ద రక్షణకోసం ఏర్పాటు చేసిన క్రాస్ బేరియర్స్ అల్యూమినియం రేకులను ఇటీవల గుర్తు తెలియని దొంగలు రేకుల బోల్ట్‌లు విప్పి పట్టుకెళ్లేందుకు ప్రయత్నాలు చేయడంతో ప్రజాశక్తిలో గతేడాది డిసెంబర్ 4న మాయమవుతున్న రోడ్డు క్రాస్ బేరియర్స్ శీర్షికతో కథనం వెలువడింది. విషయం తెలుసుకున్న దొంగలు అప్పటినుంచి విప్పిన రేకులు అలాగే ఉన్నాయి. రోడ్లు, భవనాల శాఖాధికారులు మాత్రం వాటిని ఇప్పటికీ బిగించే ప్రయత్నాలు చెయ్యలేదు. సుమారు రెండు వందల మీటర్లు పొడవునా రక్షణగా బిగించగా ఇప్పటికే 50 మీటర్లు పొడువన రేకులు విప్పి గుర్తు తెలియని వారు ఎత్తుకెళ్లిపోయారు. రోడ్డుని అనుకొని చెరువు ఉండడంతో ప్రమాదాలు జరగకుండా ప్రమాదాలు జరిగినా చెరువులోకి దూసికెళ్లకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన క్రాస్ బేరియర్స్ ఇలా మాయమవ్వడంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం ఆర్అండ్‌బి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, పట్టించుకోలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు నివారణకు క్రాస్ బేరియర్స్ ఏర్పాటు చేయాలని, దొంగలు ఎత్తుకెళ్లిన వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయంపై ఆర్అండ్‌బి జెఇ ఆంజనేయరాజు వద్ద ప్రస్తావించగా అక్కడ పరిశీలించి ఎత్తుకెళ్లిన వాటిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని, తొలగించిన చోట క్రాస్ బేరియర్స్ ఏర్పాటు చేస్తామని జెఇ తెలిపారు.

బోల్టులు విప్పి పట్టుకెళ్లేందుకు ప్రయత్నించిన క్రాస్ బేరియర్స్

భార్యపై హత్యాయత్నం

పోలీసులకు లొంగిపోయిన భర్త

ప్రజాశక్తి- పొందూరు

ప్రేమించుకున్నారు.. కలకాలం కలిసి జీవించాలని అనుకుని మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. భార్యపై అనుమానంతో చిన్నచిన్న మనస్పర్ధలు తలెత్తి అవి తారాస్థాయికి చేరుకోవడంతో విచక్షణ కోల్పోయి మండలంలోని తాడివలస పిహెచ్‌సి సమీపంలోని తోటలో భార్యపై దాడిచేసి హత్యాయత్నంకు పాల్పడ్డాడు. భార్య చనిపోయిందని అనుకుని పోలీసులకు లొంగిపోగా, చనిపోయిందనుకున్న ఆమె స్పృహలోకి వచ్చి తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొందూరు మండలం లైదాం గ్రామానికి చెందిన గొర్లె సాయిప్రసాద్, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం బలరాం పేటకు చెందిన పావనిని 2022లో ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. కొంతకాలం తరువాత మనస్పర్ధలు ఏర్పడినప్పటికీ కుమారుడు పుట్టిన తరువాత పెద్దలు జోక్యం చేసుకుని రాజీ కుదిర్చారు. అలాగే ఈనెల 7న బలరాంపేట అత్తవారింటికి వెళ్లగా, 8న మిర్తివలసలో గుడికి భార్యను ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లి అక్కడి నుంచి శ్రీముఖలింగం వెళ్లారు. అక్కడి నుంచి తిరిగివస్తూ తాడివలస సమీపంలో తోటవద్ద మాటామాట పెరిగి భార్య పావనిపై దాడిచేసి చున్నీతో మెడకు గట్టిగా బిగించాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోగా చనిపోయిందని అనుకుని శ్రీకాకుళం ఎస్‌పి కార్యాలయంలో లొంగిపోయాడు. కొద్దిసేపు తరువాత స్పృహ నుంచి బయటకు వచ్చిన ఆమె రహదారిపైకి చేరుకుని ఆటో సహాయంతో బలరాంపేట చేరుకుంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారితో కలిసి వచ్చి పొందూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. గాయపడిని పావనిని స్థానిక సిహెచ్‌సిలో చికిత్సను అందించారు. హత్యాయత్నానికి పాల్పడిన సాయిప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సంఘటనా స్థలాన్ని చూపిస్తున్న పావని

ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని అక్కయ్యవలస కూడలి జాతీయ రహదారిలో ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గుణుపూర్‌కు చెందిన జామి రాజేష్, అఖిల్‌లు గాయపడ్డాడు. ఇద్దరూ ద్విచక్రవాహనంపై నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తుండగా కొత్తపేట ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు పక్కనే ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న రాజేష్

ప్రారంభిస్తున్న దాసు, కృష్ణమూర్తి

ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని సంస్కార భారతి విద్యా సంస్థల్లో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.దాసు అధ్యక్షతన ఈ కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు సంస్కార భారతి విద్యాసంస్థల ద్వారా నాణ్యమైన, ఉన్నతమైన విద్యను అందించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం మంచి ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. 25 ఏళ్ల కాలంలో సంస్థ సాధించిన విజయాలను గురించి తెలియజేశారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కృష్ణమూర్తికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు దేవరాజు, కవి బబు, శ్రీను, పాపారావు ఆధ్యాపకులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కరాటే విద్యార్థుల సత్తా

రణస్థలం: ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో పైడి భీమవరం ఫ్యామిలీ క్వార్టర్స్ టైగర్ కరాటే అసోసియేషన్ మాస్టర్ సింక సంతోష్ కుమార్ విశాఖపట్నంలో జరిగిన విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ రాజీవ్‌గాంధీ ఫోర్ట్ స్టేడియంలో శుక్ర, శని, ఆదివారం జరిగిన సెకండ్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో విద్యార్థిని, విద్యార్థులు వివిధ రకాల సర్టిఫికెట్లు, మెడల్స్ గెలుచుకున్నారు. లోహిత, కె.హసిని, సింకజ్ఞాన ప్రదీప్, ఐ.భరత్, బి.వెంకట మేహుల్ గోల్డ్ మెడల్స్‌ను, హిరణ్య, రవి, మౌళి, బి.హాసిని, యోగితా శ్రీ, నిత్య సిల్వర్ మెడల్స్‌ను, సింక భవిష్య, ఐ.మధుప్రియ, కుమార్, రుషిత, ఇందిరా, వాసవి, వర్షిణి బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీనటుడు సుమన్ తల్వార్, శిహ్యాన్, వి రవీంద్ర కుమార్, కె.చిన్నరావు హాజరై బహుమతులు అందజేశారు. కరాటే మాస్టర్ సింక సంతోష్ కుమార్ మాట్లాడుతూ కరాటేలో తమ విద్యార్థులు అత్యున్నత ప్రతిభను సాధించారని, ఇలాంటి విజయాలు మరెన్నో సాధించి మంచి పేరు తీసుకురావాలన్నారు.

అరసవల్లి ఆలయాన్ని సందర్శించిన జనసేన ఎమ్మెల్యే మాధవి

నెల్లిమర్ల ఎమ్మెల్యే అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజవర్గం ఎమ్మెల్యే లోకం మాధవి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో స్వామివారి శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని ఆలయ ఇఒ వై.భద్రాజీ అందజేశారు.

ఆలయానికి పెరిగిన రద్దీ

మాఘమాసం రెండో ఆదివారం కావడంతో ఆలయానికి యాత్రికుల రద్దీ పెరిగింది. దీంతో ఆదివారం ఒక్కరోజు రూ.10,63,229 ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.6,78,600, విరాళాల రూపంలో రూ.116454, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,68,175 ఆదాయం సమకూరినట్టు ఇఒ భద్రాజీ తెలిపారు.

చక్కనైన చేతిరాతతో మార్కులు సొంతం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ అమలు చేస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్ సందర్భంగా ఆదివారం నడసంద్ర హైస్కూల్ విద్యార్థులకు ఆంగ్ల స్టడీ అవర్‌లో హేండ్ రైటింగ్‌పై ఆంగ్ల ఉపాధ్యాయుడు జె.ధర్మారావు ఆదివారం అవగాహన కల్పించారు. సోమవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో చేతిరాత ప్రాముఖ్యతను తెలిపారు. ఏడాది పాటు కష్టపడి చదివినా పరీక్ష రాసే రెండున్నర గంటలపైనే ఫలితం ఆధారపడి ఉంటుందన్నారు. చక్కని చేతిరాత విద్యార్థుల సొంతమైతే జవాబు పత్రం దిద్దే వారిని ముత్యాల్లాంటి అక్షరాలే తొలుత ఆకర్షిస్తాయని

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు ధర్మారావు

తెలిపారు. గుండ్రటి అక్షరాలతో ఎక్కువ మార్కులును సొంతం చేసుకోవచ్చని అన్నారు. ఇటీవల నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో కొందరు ఎక్కువగా కొట్టివేతలు, గజిబిజి రాతతో మార్కుల పోటీలో వెనుకపడ్డారని తెలిపారు. అలాగే మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో చేతిరాతపై దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. పేజీకి 18 నుంచి 20 లైన్లు రాయాలన్నారు. అర్థవంతమైన పదాలను విడగొట్టకుండా జాగ్రత్తపడాలన్నారు. లేకుంటే దాని అర్థం పూర్తిగా మారిపోయే అవకాశం ఉందన్నారు. కొట్టివేతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెప్పాలనుకున్న విషయాన్ని సూటిగా రాయాలన్నారు. ఇలా చేయడంతో వెనుకబడిన విద్యార్థులు కూడా మంచి మార్కులు తెచ్చుకోవచ్చని తెలిపారు.

పురస్కారాన్ని అందుకుంటున్న భాగ్యలక్ష్మి

ఉద్యోగిని ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఉప ఖజానా కార్యాలయంలో ఎటిఒగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.భాగ్యలక్ష్మి క్రీడారంగంలో తన ప్రతిభని చాటుకున్నారు. అనంతపురంలో నిర్వహించిన 43వ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న ఈమె 50 సంవత్సరాల విభాగంలో జావులిన్ త్రో విభాగంలో ప్రథమ బహుమతి, షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతి, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానాన్ని సంపాదించి జిల్లా కీర్తిని గుర్తింపజేశారు. టెక్కలి ఉపఖ జాన కార్యాలయంలో ఉద్యోగ పనిచేసిన భాగ్యలక్ష్మి ప్రతిభని జిల్లా యంత్రాంగం అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణంలోని 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. బన్నువాడకు చెందిన కొత్తపల్లి కృష్ణారావు రైలు ప్రమాదంలో ఇటీవల మృతి చెందారు. మృతుడి ఇద్దరు పిల్లలకు విద్యాభివృద్ధి దృష్ట్యా ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ మేరకు ఆదివారం కృష్ణారావు కుమార్తెలు చదువుతున్న పాఠశాలలకు వెళ్లి వారి ఫీజులు నిమిత్తం రూ.40 వేలు చెక్కును, నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బొంగు నరసింహమూర్తి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సి ప్రకటించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకంతో ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం ఏర్పాటై తొమ్మిది నెలలు కావస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని క్రాంతి భవన్‌లో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పిఆర్‌సి కమిటీ వేస్తామని ఆశ చూపించారని, 11వ వేతన సవరణ గడువు 2023 జూలై నాటికే ముగిసినప్పటికీ ఇంతవరకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు అన్ని ప్రయోజనాలు సకాలంలో నెరవేరుస్తామని హామీఇచ్చారని గుర్తు చేశారు. కమిటీ

మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణమూర్తి

చైర్మన్ నియామకంగాని, ఉద్యోగ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయడంగాని జరగలేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాలకు గండి కొడుతూ ఉద్యోగులే ప్రభుత్వానికి భారంగా భావించడం తగదన్నారు. ఇప్పటికైనా పెండింగ్ బకాయిలు చెల్లించాలని, అలాగే వెంటనే ఐఆర్ ప్రకటించి 12వ వేతన సవరణకు కమిటీ చైర్మన్ నియమించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గసభ్యులు పి.రామకృష్ణ, బి.సత్యం, కె.శ్రీనివాసరావు, కె.తేజేశ్వరరావు, ఎన్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావు, రాజు, కె.కరుణ కుమార్, డివిఎన్ పట్నాయక్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధనుంజయరావు

'మైనార్టీలకు టిడిపితోనే గుర్తింపు'

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని వివిధ వర్గాల మైనార్టీ ప్రజల ఆశయాలకు, అవకాశాలకు ఎమ్మెల్యే కూన రవికుమార్ కొత్త ఊపిరి అందించారని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ(డివిఎంసి) మెంబర్ తాళాబత్తుల ధనుంజయరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ పాఠశాల వద్ద విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆయనను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణకారులకు మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి మంగళగిరిలో స్వర్ణాభరణాల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ నియోజకవర్గంలో సంక్షేమ, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కష్టపడి పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు లోలుగు విశ్వేశ్వరరావు, (శాస్త్రి మాస్టారు), కార్యదర్శి డి.శ్రీనివాసరావు, క్రియాశీలక సభ్యులు మండా రాజేశ్వరరావు, ఒమ్మి భాస్కరరావు, కటకం హరి ప్రసాద్, రాజాజీ, టేకి గోపాలకృష్ణ, నిమ్మగడ్డ రామనాగు, మండా శ్రీనివాసరావు, చెవూరి కామేశ్వరరావు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

పాతపట్నం : మండలం అంతటా పొగ మంచు దుప్పటిలా కప్పేసింది. తెంబూరు నుంచి గంగువాడ, లోగిడి నుంచి పాతపట్నం వెళ్లే రహదారి పూర్తిగా మంచుతో నిండిపోయింది. ఆదివారం ఉదయం రహదారిపై వాహనాలు కనిపించకుండా పొగ మంచు కమ్మేసింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రహదారిపై వంద మీటర్ల ఎదురుగా ఉన్న వాహనాలు కూడా ఈ పొగ మంచుకు కనిపించకపోవడంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. మండలంలోని తెంబూరు నుంచి పెద్దగుజ్జువాడ, మూగపురం, బొంతు కూడలికి వెళ్లే మార్గం పూర్తిగా 8.30 గంటల వరకు సూర్యుడు కనిపించకపోవడం ఒక ఎత్తయితే 9 గంటల నుంచి ఎండ తీవ్రత ఒక ఎత్తు. ఈ పొగ మంచు వల్ల

మామిడి, జీడి పూతలు దెబ్బతింటాయని రైతులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పూత దశలో ఉన్న పంటలు, తోటలకు అపార నష్టం వాటిల్లుతుంది.

ఆమదాలవలస : గడచిన వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న మంచు కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుందడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు వీడకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని నెమ్మదిగా ప్రయాణం చేయాల్సి వస్తుందని ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇబ్బందులకు గురవుతూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు చెబుతున్నారు. పొగమంచు కారణంగా జీడీ, మామిడి, పూతకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పూట నడకను కొనసాగించే ప్రజలు పొగమంచు కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని మంచు దుప్పటి కారణంగా ఏ క్షణాన ఎటువంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని ఆందోళన చెందుతున్నామని పలువురు చెబుతున్నారు. పొగమంచు ఇబ్బందులు ఇంకెన్నాళ్లు ఎదుర్కోవాలోనని పలువురు చర్చించుకుంటున్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా హిందీ ప్రచార సభ పరీక్షలు

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలను మండలంలోని కోష్ట శ్రీనారాయణ స్కూల్‌లో హిందీ మంచ్ నిర్వహణ కార్యదర్శి పి.రామారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నాగరీ బోధ్‌కు 40 మంది, ప్రవేశకు 80 మంది, ప్రథమకు 54 మంది, మధ్యమకు 40 మంది, ఉత్తమకు ఆరుగురు చొప్పున 220 మంది వివిధ పాఠశాలల నుంచి హాజరై పరీక్షలు రాశారు. గ్రామీణ ప్రాంతంలో హిందీపై అభిలాష పెంచడానికి, హిందీ పండితులను తయారు చేయడంలో నారాయణ స్కూల్ డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ ఎస్.గౌరి నాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది కృషి చేస్తున్నట్లు హిందీ మంచ్ నిర్వహణ కార్యదర్శి పి.రామారావు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- పాతపట్నం

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని జగ్గిలబొంతులో ఆదివారం సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వత్తు పదార్థాలు వాడకం వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కచేరి చేస్తున్న కళాకారులు

వేడుకగా తిరు కళ్యాణం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని లోల్లపుట్టుగలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి 44వ తిరు కళ్యాణ మహోత్సవం, 55వ సుప్రభాత వార్షికోత్సవ వేడుకలు వైభవోపేతంగా సాగాయి. అందులో భాగంగా చివరి రోజైన ఆదివారం నిర్వహించిన కర్ణాటక గాత్ర సంగీత కచేరి శ్రోతలను రంజింపజేసింది. ఎఐఆర్ ఆర్టిస్టు (ఎస్‌వి మ్యూజిక్ కాలేజ్, తిరుపతి) జయరాం గాత్రానికి శ్యామ్ నీలాద్రిరావు వయొలిన్, బొంతల కోటి సత్య వరప్రసాద్ మృదంగం, మండపాక రవి కంజీర తోడవడంతో కచేరి 'న భూతో న భవిష్యత్' అన్న విధంగా సాగింది. వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.